

## చిన్నారులతో మమ అనిపించారు..!

జై బాపు, జై భీం, జై సంవిధాన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన పాదయాత్రకు ప్రజల ఆదరణ కరువైంది. శనివారం కాంగ్రెస్ నాయకులు పెద్దేముల్ మండలంలోని ఓమ్లానాయక్ తండాలో బ్యానర్లు పట్టుకుని తిరిగినా ప్రజలు వారివెంట కనిపించ లేదు. దీంతో చిన్నారులతో కార్యక్రమాన్ని మమ అనిపించారు. –తాండూరు, ఏప్రిల్ 12


నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, ఆదివారం 13 ఏప్రిల్ 2025 VIKARABAD


## భారీగా వెళ్లి సక్సెస్ చేద్దాం

### బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, చిత్రంలో టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్ : తెలంగాణలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బంట్వారం మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. దీనికి ఆనంద్ ము ఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు సీనియర్ నాయకుడు ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లేశాన్ని బంట్వారం మండల పార్టీ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా అశోక్ ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అల్లాపురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఖాజాపాషా, మండల యువజన విభాగం అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చా రు. 16 నెలల కాంగ్రెస్ పాలన చూశాక ప్రజలందరూ మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికే మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. తెలంగాణలో రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశా రు. సమావేశంలో టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, బీఆర్ ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణాధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బల్వంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మర్పల్లి మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వికారాబాద్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు నర్సింహులు, వికారాబాద్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, వికారాబాద్ మండలం కార్యనిర్వాహక అధ్యక్షుడు అశోక్, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పండుగలా తరలివెళ్దాం..

## వరంగల్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

- కేసీఆర్ పేరును చెరపడం.. రేవంత్ తరం కాదు
- సూర్యచంద్రులు ఉన్నంతకాలం, తెలంగాణ పదం వినిపించినన్ని రోజులు ఆయన్ను ప్రజలు మరిచిపోరు
- కేసీఆర్ ఏమి చేశాడు.. రేవంత్ ఏమి చేస్తున్నాడో ప్రజలకు స్పష్టంగా అర్థమైంది ..
- త్వరలోనే ఉప ఎన్నిక రానున్నది
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- మొయినాబాద్ స్టార్ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ చేవెళ్ల నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశం
- హాజరైన పార్టీ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పట్నం అవినాశ్‌రెడ్డి, ఇతర నేతలు



కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో అవినాశ్‌రెడ్డి ఇతర నేతలు

షాబాద్/మొయినాబాద్, ఏప్రిల్ 12 : తెలంగాణలో కేసీఆర్ పేరు చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదని .. సూర్యచంద్రులు ఉన్నంతకాలం, తెలంగాణ పదం వినిపిస్తున్నంతకాలం కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మొయినాబాద్ మండలంలోని స్టార్ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా సబితారెడ్డి హాజరై కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల పండుగను జరుపుకోనున్నట్లు తెలిపారు. కేసీఆర్ ఏమి చేశారని కొందరూ మూర్ఖులు మాట్లాడుతున్నారని, తెలంగాణ వచ్చేందుకు 14 ఏండ్లు ఏ విధంగా కష్టపడారో ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఆ సమయంలో ఆయన ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కసిగా పనిచేసి రాష్ర్టాన్ని సాధించారని కొనియాడారు. 14 ఏం డ్లు తెలంగాణ ఉద్యమాన్ని ఏ విధంగా నడిపించారు.. రాష్ర్టాన్ని సాధించి.. పదేండ్లు పాలన ఎలా చేశారో బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ ఏమి చేశా రు.. రేవంత్‌రెడ్డి ఏమి చేస్తున్నాడో ప్రజలకు స్పష్టంగా అర్థమై పోయిందన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికెళ్లి ప్రజలను కదిలించినా కేసీఆర్‌ను ఓడించి చాలా తప్పు చేశామని చెబుతున్నారని.. 16 నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలందరూ చాలా విసిగిపోయారన్నారు. అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిప డ్డారు. అరకొరగా పంట రుణాలను మాఫీ చేయడంతోపాటు అన్నదాతలకు రైతుభరోసా ఎగ్గొట్టాడని.. తులం బంగారం ఊసే లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. పొద్దున లేవగానే తాగేందుకు గ్లాసులో నీటిని పట్టుకోగానే మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ కనిపిస్తారని, ఊర్లలో కనిపించే పచ్చని చెట్లను చూస్తే కేసీఆర్ తీసుకొచ్చిన హరితహారం గుర్తుకొస్తుందన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ అధినేత చేసిన పనులే కనిపిస్తున్నాయని ఆమె స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని.. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని అంటున్నాడని.. అది ఆయనకు సాధ్యం కాదన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం, తెలంగాణ పదం వినిపిస్తున్నంతకాలం కేసీఆర్‌ను ఎప్పటికీ ప్రజలు మరిచిపోరన్నారు. 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో తరలివచ్చి సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా మన ఇంట్లో పం డుగ జరిగితే ఎలా వెళ్తామో అలాగే.. దండులా తరలిరావాలన్నారు. మీటింగ్‌కు వెళ్లే వాహనాల్లో ఎక్కేటప్పుడు పండుగ వాతావరణంలో ర్యాలీగా వెళ్లి ఎక్కాలన్నారు. ప్రతి బస్సుకూ ఆయా గ్రామాలకు సంబంధించిన పేర్లతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుని, వాటిపై డ్రైవర్ల ఫోన్ నంబర్లు వేయించాలన్నారు. కార్యకర్తలకు ప్రతి బస్సులోనూ తాగునీరు, భోజనం అందించాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల నుం చి 100 బస్సులు, 300 కార్లలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, అభిమానులు అధికంగా తరలిరావాలన్నా రు. ఎక్కడికెళ్లినా చేవెళ్లకు ఒక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలోనూ వాల్‌రైటింగ్‌లు రాయించాలన్నారు. సోషల్ మీడియా వాళ్లు యాక్టివ్‌గా పనిచేయాలన్నారు. త్వరలోనే ఉప ఎన్నిక రానున్నదని.. ముందుగా చేవెళ్లనే గెలిపించుకు రావాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఉప ఎన్నికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

### రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం..



మనం కష్టపడి గెలిపించిన వారే.. మన కార్యకర్తలను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారు. ఎవరెన్నీ ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదు. పార్టీ మారిన వారి గురించి పట్టించుకోవద్దు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం. ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఊరూవాడా.. ఒక్కటై కదిలి సక్సెస్ చేద్దాం. రేవంత్ సర్కార్ అలవి కాని హామీలిచ్చి.. పవర్‌లోకి వచ్చాక ప్రజలందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఒక్క హామీని కూడా ఇప్పటివరకు సక్రమంగా అమలు చేయలేదు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ర్టానికి, ప్రజలకు న్యాయం జరుగుతుంది. బీఆర్ఎస్ అధినేతతోనే అభివృద్ధి సాధ్యం

-పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

### ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది..



కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ఏ ఒక్క హామీని అమలు చేయక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడు తున్నారు. తెలంగాణను కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. అన్ని వర్గాలకు అండగా నిలిచారు. ఈ నెల 27న జరిగే వరంగల్ సభకు ప్రతి గ్రామం నుంచి భారీగా సంఖ్యలో తరలివెళ్లి సభను సక్సెస్ చేసి..కాంగ్రెస్ సర్కార్‌కు వణుకుపుట్టిద్దాం.

–కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు



సన్నాహక సమావేశానికి హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు



బంధం చెరువు చుట్టూ ఏర్పాటు చేస్తున్న కంచె

## ఫార్మా ఫెన్సింగ్‌తో

# తెగుతున్న బంధం

- మూగజీవాల దాహార్తి తీర్చే బంధం చెరువు
- చెరువులోకి వెళ్లకుండా ఫెన్సింగ్ వేస్తున్న వైనం

అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

రంగారెడ్డి, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : భూసేకరణ పేరుతో ఫార్మా భూముల చుట్టూ వేస్తున్న ఫెన్సింగ్‌తో బంధంచెరువు బందీగా మారనున్నది. ఫార్మాకోసం సేకరించిన భూముల్లోని అటవీ ప్రాంతంలో బంధం చెరువు ఉన్నది. అడవి జంతువులతో పాటు బర్రెలు, గొర్రెలు ఈ చెరువులోని నీటిని తాగుతాయి. అధికారులు చేపట్టిన కంచె ఏర్పాటు పనులతో ఈ చెరువులోకి దప్పిక తీర్చుకునేందుకు మూగజీవాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. యాచారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో బంధంచెరువు సుమారు 24 ఎకరాల్లో విస్తీర్ణం ఉన్నది. అడవి జంతువులకు ఈ చెరువే కొన్నేండ్లుగా దప్పిక తీర్చుతున్నది. మూగజీవాల దప్పిక తీర్చుతున్న బంధం చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులను ఆపాలని.. రైతులు అడ్డుకున్నా పోలీసుల బందోబస్తుతో చేపట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఫెన్సింగ్ ఏర్పాటు దారుణం

మా తాతలు, తండ్రుల కాలం నుంచి ఈ చెరువునే నమ్ముకుని జీవిస్తున్నాం. ఈ చెరువు మూగజీవాల దప్పిక తీర్చుతున్నది. అలాంటి చెరువును చెరబట్టి చుట్టూ ఫెన్సింగ్ వేయడం దారుణం.



-చిట్టి నాగరాజు

### చెరువులను చెరబట్టడం సరికాదు..

అధికారులు గ్రామాల్లో వేస్తున్న ఫెన్సింగ్ చట్ట విరుద్ధం. ఫార్మా భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా పోలీసు బందోబస్తు మధ్య అధికారులు భూముల్లో కంచె వేస్తున్నారు. మూగజీవాల దాహార్తిని తీర్చే బంధంచెరువు చుట్టూ కంచె ఏర్పాటు సమంజసం కాదు.



– కావుల సరస్వతి, ఫార్మా భూవ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు

## తలాపునే చెరువున్నా..

# ఒక్క గుంటా పారదు..


- కొల్లం చెరువు నిండుకుండలా ఉన్నా.. ఆయకట్టుకు చుక్క నీరు అందని దైన్యం
- పనిచేయని తూములు, శిథిలమైన కాల్వలు
- ఎండుతున్న పంటలతో అన్నదాత దిగాలు

బంట్వారం, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలో ఉన్న కొల్లం చెరువు నిండుకుండలా ఉన్నా చుక్క నీరు మాత్రం పొలాలకు పారడం లేదు. దీని కింద 360 ఎకరాల ఆయకట్టు ఉండగా.. రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తూ నష్టపోతున్నారు. చెరువు కాల్వలు ముళ్లపొదలతో నిండి శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా తూము నుంచి నిత్యం నీరంతా లీకేజీ అవుతున్నా వాటికి మరమ్మతులు చేసే నాథుడే లేడు. గతంలో చెరువు నీటితో వంద ఎకరాల్లో రైతులు పంటలను పండించేవారు.. అయితే ప్రభుత్వ తీరు, అధికారుల అలసత్వంతో చెరువు ఆదరణకు నోచుకోవడం లేదు. ఆయకట్టు రైతుల పొలాలు చుక్క నీరు అందకపోవడంతో ఎండిపోతున్నాయి.



నీటితో కళకళలాడుతున్న కొల్లం చెరువు

గత కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంతో కొల్లం చెరువును పునరుద్ధరించింది. రూ. 54.30 లక్షలతో చెరువులోని పూడికను తీయడంతో పాటు కొత్త కాల్వలను నిర్మించిం ది. 650 మీటర్ల పొడవు ఉన్న కట్టను 3 మీట ర్ల ఎత్తుకు పెంచడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి.. పుష్కలంగా నీళ్లు నిండాయి. 360 ఎకరాల ఆయకట్టు రైతుల పొలాలకు నీటిని అందించేందుకు 160 మీటర్ల సీసీ కాల్వలను నిర్మించింది.



అలుగు వద్ద నీటి లీకేజీ

### కాల్వ బెడ్ పగిలి.. నీరంతా పొలంలోకి..

నా పొలం పక్క నుంచే కాల్వ వెళ్తుంది. అయితే, ఆ కాల్వ పగిలిపోయి వానకాలంలో నీరంతా పొలంలోకి వచ్చి పంట మొత్తం నాశనమవుతున్నది. వానకాలంలో అలా ఉంటే.. యాసంగిలో పొలానికి చుక్క నీరు అందని పరిస్థితి నెలకొన్నది. చెరువు నిండుకుండలా ఉన్నా కాల్వలు సక్రమంగా లేకపోవడంతో నా పొలానికి నీరందక ఎండిపోతున్నది. ఇలా రెండు రకాలుగా నష్టపోతున్నా. నాకున్న 12 ఎకరాల్లో ఏ పంట వేసినా చేతికి రావడం లేదు. అధికారులు స్పందించి కాల్వలకు మరమ్మతులు చేయించాలి.



-పాపయ్య రైతు, బంట్వారం


### అలుగు నీటితో పొలం కోతకు గురవుతున్నది..



చెరువు అలుగు నీటితో చాలా నష్టపోతున్నా. వానకాలంలో చెరువు నిండి అలుగు పోయడంతో ఆ వరదతో పొలం కోతకు గురై ఏ పంట సాగు చేసినా పండడం లేదు. అలుగు పోస్తున్న ప్రాంతంలో కొంతవరకు రక్షణ గోడ నిర్మిస్తే బాగుంటుంది. కానీ, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పక్కనే చెరువున్నా.. ఏమి లాభం లేదు. చెరువు నిర్మాణానికి తన సొంత పొలం 12 ఎకరాలను ఇచ్చా. -మౌనేశ్, రైతు, బంట్వారం

### నేడు ఆదరణ కరువు..

కాంగ్రెస్ పాలనలో కొల్లం చెరువు ఆదరణ కోల్పోయింది. నిండు వేసవిలోనూ నీటితో నిండుకుండలా ఉన్నా.. ఆయకట్టు పొలాలకు మాత్రం చుక్క నీరు అందడం లేదు. తూము విరిగి చెరువులో పడిపోయింది. ముళ్లపొదలతో నిండి కాల్వలు శిథిలావస్థకు చేరడంతో పొలాలకు నీరు అందే పరిస్థితే లేకుండా పో యింది. చెరువు అలుగు నుంచి నిత్యం నీరు లీకేజీ అవుతున్నా..దానిని అరికట్టేందుకు ఎవ రూ ముందుకు రావడం లేదు. లీకేజీలు, కా ల్వలను మరమ్మతులు చేసి.. పొలాలను నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.



చెరువు నుంచి నీరు అందక ఎండు ముఖం పట్టిన మొక్కజొన్న పంట

### నీటి పారుదల శాఖే చూసుకోవాలి

చెరువులో ఏమి జరిగినా మాకేమి సంబంధం లేదు. దానిని నీటి పారుదల శాఖ వారే చూసుకోవాలి. కాల్వల నిర్మాణం, నీటి సరఫరా తదితర అంశాలను ఆ అధికారులదే బాధ్యత.

- విజయ్‌కుమార్, తహసీల్దార్, బంట్వారం